నెర్రికాలువ.. పోర్లుకట్ట ధ్వంసం



మావిళ్లపాడు-టపాయిండ్లు గ్రామాల మధ్య నెర్రికాలువ దుస్థితి

- లాకుల వద్ద లీకులు
- నిధులన్నీ తమ్ముళ్ల జేబుల్లోకి
- చెరువుల్లోకి చేరని వర్షపు నీరు

దొరవారిసత్రం : పంటలకు నీరందించే నెర్రికాలువకు పలుచోట్ల పొర్లు కట్టలు ధ్వంసమైపోయాయి. కొన్ని చోట్ల లాకులు ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల నీరు లీకవుతోంది. వర్షపు నీరు చెరువుల్లోకి చేరడం లేదు. దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో 17.5 కిలోమీటర్లు విస్తరించి ఉన్న నెర్రి కాలువ అభివృద్ధికి గత టీడీపీ హయాంలో నీరు–చెట్టు కింద 2015–16లో కోట్లు కుమ్మరించినా బాగు పడలేదు. ఆయా ప్రాంతాల్లోని అప్పటి తెలుగు తమ్ముళ్లు వచ్చిన నిధులు వచ్చినట్లే కాలువ పనులు తూతూ మంత్రంగా చేసి జేబులు నింపుకున్నారే తప్ప కాలువ రూపురేఖలు మారలేదు. ఇరిగేషన్ రికార్డుల్లో మాత్రం కోట్లు వెచ్చించినట్లు ఉందే తప్ప నెర్రికాలువ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. నెర్రికాలువను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో (2021–22) రూ.28.2కోట్లు నిధులు కేటాయించారు. ఈ నిధులతో కాలువలో లైనింగ్ పనులు, వాల్ పనులు చేపట్టారు. ఇంతలో ఎన్నికల వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో నెర్రికాలువ అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోవడంతో కాలువ దుస్థితి దయనీయంగా మారింది. పలు ప్రాంతాల్లో కాలువకు ఉన్న పొర్లు కట్ట, లాకులు ధ్వంసమై సాగు నీళ్ల రైతులు దరి చేరకుండాపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీవీ సత్రంలో పుట్టి..

దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామ సమీపంలోని కాళంగి నది నుంచి నెర్రికాలువ పుట్టుతుంది. ఇక్కడి నుంచి వివిధ గ్రామాల మీదుగా సూళ్లూరుపేట మండలంలోని పలు గ్రామాలను తాకుతూ తడ మండలం కారిజాత గ్రామం వరకు 17.5 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా అధికారికంగా 17 చెరువుల్లో సాగు నీళ్ల నేరుగా సప్లయ్ ఛానల్స్ ద్వారా చేరగా ఆయకట్టు కింద ఉన్న 15వేలు ఎకరాలకు సాగు నీళ్ల అందుతున్నాయి. కానీ వాస్తవంగా కాలువలోని నీటిని అనధికారికంగా వందల మంది రైతులు ఆయిల్ ఇంజిన్లు, విద్యుత్ మోటార్లు పెట్టుకుని మరో వెయ్యి ఎకరాల వరకు సాగు చేసుకుంటున్నారు. దీంతో పాటు కాలువలో సాగు నీళ్ల ఉంటే కాలువ వెంబడి ఉన్న వ్యవసాయ బోర్లు, బావులు సైతం సాగు నీటితో పుష్కలంగా ఉంటాయి.

పనులు పూర్తి చేసి ఉంటే...

గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులను అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఇప్పటి ప్రభుత్వం రైతులను విస్మరించడంతో దిట్టగా మారడంతో రైతులకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందకపోగా కాలువ అభివృద్ధికి కేటాయించి నిధులతో చేయాల్సిన పనులు సైతం అందని ద్రాక్షగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం నెర్రికాలువకు కేటాయించిన నిధులతో కాలువకు ఇరుపక్కలా పొర్లుకట్ట అభివృద్ధి పనులు, పలు ప్రాంతాల్లో ఉన్న లాకుల మరమ్మతులు, కాలువ అడుగ భాగంలో కాంక్రీట్ లైనింగ్, వాల్ నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఏవీ ప్రారంభం కాలేదు.

ప్రతిపాదనలు పంపించాం

నెర్రికాలువ నుంచి చెరువుల్లో సరఫరా చేసే సప్లయ్ ఛానల్‌పై ఉన్న లాకుల అభివృద్ధికి, కాలువలో పూడికతీత పనులకు కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.40 లక్షలు ప్రతిపాదనలు పంపించాం. గత ప్రభుత్వంలో నెర్రికాలువ అభివృద్ధికి కేటాయించిన నిధులు విషయం కూడా జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాం.

- రమేష్, ఏఈ ఇరిగేషన్ శాఖ, డీవీ సత్రం



టపాయిండ్లు గ్రామ సమీపంలో నెర్రికాలువపై లాక్‌లు లేని దృశ్యం



లింగంపాడు చెరువుకు చెందిన సప్లయ్ చానల్‌పై లాక్ దుస్థితి

లాకుల సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా...

నెర్రికాలువ నుంచి లింగంపాడు, తల్లంపాడు గ్రామంలోని చెరువులోకి సాగు నీళ్ల సరఫరా చేసే సప్లయ్ చానల్‌కు చెందిన లాక్‌కులు దెబ్బతినడం, కాలువ పూడిపోవడంతో చెరువులోకి సాగు నీళ్ల చేరడంలేదని మే లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు లింగంపాడు గ్రామానికి విచ్చేసిన సమయంలో స్థానిక రైతులు వినతి పత్రం ఇచ్చి పరిష్కారం చేయాలని కోరారు. స్పందించిన ఆయన నెర్రికాలువపై ఉన్న లాక్‌ల మరమ్మతులకు, కాలువలో పూడికతీతకు ఎఫ్‌డీఆర్ కింద నిధుల కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపాలని సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. కానీ నేటి వరకు ఎలాంటి ఊస కూడా వినిపించలేదు.



రైతులు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ (ఫైల్)

క్లుప్తంగా

టీచర్స్ క్రికెట్ లీగ్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో సేవా సంస్థ ప్రతినిధులు

గూడూరురూరల్ : గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 3వ వరకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 6వ టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఆదివారం టోర్నమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీచర్స్ క్రికెట్ లీగ్‌ను ఈ ఏడాది కూడా ఉన్నతమైన ప్రణాళికతో మెరుగైన నిర్వహణ బాధ్యతతో నిర్వహిస్తామన్నారు. టోర్నీకి సంబంధించిన విధివిధానాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీడీ కరిముల్లాఖాన్, మురళీసింగ్, షేక్ బాబర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీనియర్ క్రీడాకారులు ముని భాస్కర్ పాల్గొన్నారు.

నిత్యాన్న పథకానికి రూ.50 వేలు విరాళం



నగదు అందిస్తున్న గురవయ్య, ఆదిలక్ష్మమ్మ

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా రాపూరు సిద్దలయ్య సెంటర్‌కు చెందిన విజ్ఞానగిరి గురవయ్యదేవర దంపతులు రూ.50వేలు నగదు ఆదివారం దేవస్థాన అర్చకులు వినోద్‌స్వామికి అందించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేటటౌన్ : పేద విద్యార్థిని పుల్ల హాసినికు స్కూల్ ఫీజు కోసం బలిజ చేయూత ఫౌండేషన్ వారు ఆర్థిక సాయం చేశారు. ఓజిలి మండల కేంద్రానికి చెందిన హాసినికి ఆదివారం పట్టణంలోని వారి కార్యాలయం వద్ద రూ.9 వేల నగదు అందించారు. తమ ఫౌండేషన్ ప్రెసిడెంట్ పగడాల శివ ప్రదీప్ సారథ్యంలో ఇలాంటి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన హంసా పృథ్వీచంద్, రామారావు, నీలం హరికృష్ణ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్యశిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

పెళ్లకూరు: మండల కేంద్రంలోని చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆదివారం ట్రస్ట్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి పరిసర గ్రామాల నుంచి పలువురు విచ్చేసి కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య పరీక్షలు అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు పలువురికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. సుమారు 15మంది వ్యాధిగ్రస్తులకు శస్త్ర చికిత్సల నిమిత్తం తిరుపతికి తరలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, డాక్టర్ ఆకాంక్ష వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

11నుంచి కుంభాభిషేకం

పెళ్లకూరు: మండల కేంద్రంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆదివారం ఆలయ కమిటీ తెలియజేసింది. పుష్కర అష్టబంధన మహా కుంభాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, మామిడి తోరణలతో ఆలయ ప్రాంగణం అందంగా అలంకరిస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

చికెన్ ధరలు 04.8.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	114
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

మహిళా కండక్టర్ సస్పెన్షన్‌పై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట : స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న మహిళా కండక్టర్ బీ పద్మను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మూడో రోజున అంటే ఆదివారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి ఎం శేఖర్ మాట్లాడుతూ డిపోకు ఇన్‌చార్జి మేనేజర్‌గా పని చేస్తున్న మునిచంద్ర 01/2019 జీవోకు విరుద్ధంగా మహిళా కండక్టర్‌ను నిబంధనలను తుంగలో తొక్కి సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. జీవోను ఉల్లంఘించి నిర్ణయం తీసుకుకోవడం, ఆ జీవోను ఇచ్చిన ఎండీ, ఈడీని కించపరిచిన వ్యక్తిగా ఈ డిపో మేనేజర్ పనితీరు ఉందని చెప్పారు. అక్రమ సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండిస్తూ డిపోలోని ఎన్‌ఎంయూ ఉద్యోగులు అందరూ విధులు నిర్వర్తిస్తూనే నిరసన తెలియజేస్తున్నామని, ఈ అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేసి మహిళా కండక్టర్ బీ పద్మకు న్యాయం చేయాలని డిపోలోని కండక్టర్లు, డ్రైవర్లు డిమాండ్ చేశారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం అందజేత



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

గూడూరురూరల్ : పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులోని ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, గూడూరు టౌన్ క్లబ్, వెస్ట్ క్లబ్‌ల సేవా కార్యక్రమాల్లో భాగంగా మాజీ అధ్యక్షుడు మురళిరాజు దాతృత్వంతో ఆదివారం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థినికి కాలేజీ ఫీజు కోసం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.రావు చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని సూచించారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ క్లబ్ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైజేపీ క్లబ్ సెక్రటరీ మురళీకృష్ణ, ట్రెజరర్ గోపినాథ్‌రెడ్డి, వినోద్‌కుమార్, కావేరి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ



వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

వెంకటగిరి రూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చని వెంకటగిరి సీఐ ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ యూ ట్యూబర్ సురేష్ సహకారంతో పట్టణంలోని త్రిభువని సెంటర్ వద్ద ఆదివారం ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ వినియోగించడంపై ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు తలకు గాయాలు కాకుండా ఉంటుందన్నారు. అనంతరం పట్టణానికి చెందిన సుమారు 100 మందికి హెల్మెట్లను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వాకాడులో ఎన్‌బీకేఆర్‌కు నివాళి





బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న హిమకుమార్‌రెడ్డి, ఎన్‌బీకేఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

వాకాడు : ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 47వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో బాలకృష్ణారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి పాల్గొని సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణారెడ్డి విద్యాభివృద్ధికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ సేవలు వెల కట్టలేనివి

కోట: దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వర్ధంతిని ఆదివారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న బాలకృష్ణారెడ్డి విగ్రహానికి అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి బాలక్రిష్ణారెడ్డి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలను స్థాపించి అనేక మందికి విద్యాదానం చేశారన్నారు. ఇక్కడ చదువుకున్న వారు దేశ, విదేశాల్లో నేడు ఉన్నత స్థానంలో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో చింతా రవీంద్రరెడ్డి, రాజశేఖరరెడ్డి, హరనాథ్‌రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

బీచ్‌లో పునీత్ సాగర్ అభియాన్



బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన అనంతరం అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు




ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం బీచ్‌లో కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ విద్యా ర్థులు ఆదివారం పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బీచ్ పరిసరాల్లో ప్లాస్టిక్ బాటిల్స్, చెత్తా, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఎన్‌సీసీ అధికారి గోవిందు మాధవయ్య మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ ఎన్‌సీసీ విద్యార్థులచే బీచ్ పరిసరాలను ఏడాదిలో రెండు సార్లు శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. దుగ్గరాజపట్నం మెరైన్ ఎస్‌ఐ సౌమ్య విద్యార్థులను అభినందించి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాం ఆలయంలో ప్రత్యేక పూజలు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి, విశేష అలంకరణ చేశారు. స్వామి, అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో అలంకరించి ఆలయ పురోహితులు మూలంరాజు భానుప్రకాష్ శర్మ వేద మంత్రోచ్ఛరణతో అభిషేకాలు నిర్వహించారు. కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు వేశారు. అనంతరం భక్తులు తలనీలాలు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మీ దేవికి 8న సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. వరలక్ష్మి వ్రతంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి ప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ ,ప్రసాదాలు, గాజులను ఉభయకర్త సీతారామయ్య స్వామి అందిస్తారని తెలిపారు.

కండలేరులో 25.832 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 25.832 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేలకొరిగిన వరిపైరు



పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తేలికపాటి వర్షంతో కూడిన ఈదురు గాలులకు పలుచోట్ల వరిపైర్లు నేలకొరిగాయి. జీలపాటూరు, చిల్లకూరు, నెలబల్లి, చావలి, కలవకూరు, పుల్లూరు తదితర గ్రామాల్లో వరి పైర్లు కోత దశకు చేరుకున్నాయి. పలు ప్రాంతాల్లో వరికోతలు మొదలయ్యాయి. అయితే సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు అష్టకష్టాలు పడి పంటలు పండించారు. ఎట్టకేలకు పంట చేతికందుతుందనుకుంటున్న తరుణంలో తేలికపాటి వర్షం, ఈదుర గాలుల వల్ల వరిపైర్లు నేలకొరిగాయి. దాంతో 20శాతానికి పైగా ధాన్యం వరి పొలాల్లోనే రాలిపోయిందంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట నష్టాలను గుర్తించి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

-పెళ్లకూరు